## క్లుప్తంగా

### కైలాసగిరిపైకి ప్రవేశం నిషేధం



మూసేసిన కైలాసగిరి ప్రవేశ ద్వారం

ఆరిలోవ: జీ–20 సదస్సు కోసం నగరానికి చేరుకున్న పలువురు విదేశీ అతిథులు సోమవారం సాయంత్రం పర్యాటక కేంద్రం కైలాసగిరిని సందర్శించారు. దీంతో కైలాసగిరిపై పోలీస్ బందోబస్తు నిర్వహించారు. వారికి రక్షణ కల్పించే చర్యల్లో భాగంగా పోలీసులు ఉదయం నుంచి రోజంతా సందర్శకులకు కొండపైకి ప్రవేశం నిషేధించారు. విశాలాక్షినగర్‌లో రోడ్డు మార్గంలో ప్రవేశ ద్వారం, అప్పూఘర్ వద్ద మెట్లు మార్గం, రోప్ వే మార్గాన్నీ మూసేశారు. ఈ విషయం తెలియక ఎప్పటిలాగే కైలాసగిరిపైకి వెళ్లాలని వచ్చిన సాధారణ సందర్శకులు ద్వారం వద్ద నుంచే తిరిగి వెళ్లిపోయారు.

### తోటగరువు హైస్కూల్ సందర్శన

ఆరిలోవ: తోటగరువు హైస్కూల్‌ను సోమవారం డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ సందర్శించారు. మరో వారంలో జరగనున్న పదో తరగతి పరీక్షల కోసం ఇక్కడ విద్యార్థులు ఏవిధంగా సిద్ధమవుతున్నారో హెచ్‌ఎం దుర్గాభవాని, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని ఆయన సూచించారు. పరీక్ష విధానంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పోషక విలువలతో కూడిన ఆహారం తినాలని, క్రమ పద్ధతిలో చదవాలని సూచించారు.

### వైభవంగా సీతారామచంద్ర స్వామి తిరువీధి



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీసీతారామచంద్రస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మణ, హనుమ సహిత స్వామివారి ఉత్సవ మూర్తులను కాలనీలోని పలు సెక్టార్లలో ఊరేగించారు. ఈ నెల 30న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

### క్షయ వ్యాధిపై అవగాహన

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం టీబీ వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడ రైతులు, వ్యాపారులకు క్షయ నివారణ కరపత్రాలు అందించారు. క్షయ క్రిముల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని, దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు వారాల వరకు దగ్గు, జ్వరం, తగ్గకపోవడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం తదితర వాటితో బాధపడుతున్నవారు వెంటనే అందుబాటులో ఉండే వైద్యులను సంప్రదించాలన్నారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

# తూర్పు తీరం.. శోభాయమానం

- హరితమయంగా సాగర తీరం
- మెరిసిపోతున్న రహదారులు, ఫుట్‌పాత్‌లు
- జీ–20 సదస్సు నేపథ్యంలో నవ్యశోభ



ఫుట్‌పాత్‌లను నీటితో శుభ్రం చేస్తున్న సిబ్బంది



బీచ్‌రోడ్డులో డివైడర్లు, పార్క్‌లో దర్శనమిస్తున్న పచ్చదనం



నూతనంగా నిర్మించిన రహదారులు

ఏయూ క్యాంపస్: తూర్పు తీరం శోభాయమానంగా దర్శనమిస్తోంది. జీ–20 సదస్సు నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం పరిధిలోని రహదారులు, పార్కులు కొత్త శోభను సంతరించుకుని కళకళలాడుతున్నాయి. సుందర విశాఖ సాగర తీరం హరిత హారంగా మారింది. జీ–20 సదస్సు ఏర్పాట్లలో భాగంగా జీవీఎంసీ అధికారులు సాగరతీరంపై ప్రత్యేక దృష్టిసారించారు. తీరానికి అభిముఖంగా ఉన్న స్థలాల్లో పూర్తిస్థాయిలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకున్నారు. డివైడర్లు, విద్యుత్ దీప స్తంభాలు ఉన్న ప్రాంతాల్లో విభిన్న రకాల, వర్ణాల మొక్కలు నాటారు. రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ దీప స్తంభాలకు ప్రత్యేకంగా మొక్కల కుండీలను వేలాడదీశారు. కొబ్బరిపీచు, మట్టివేసి వీటిలో కొన్ని ప్రత్యేకమైన రంగు రంగుల పుష్పాల మొక్కలు నాటారు.

**అద్దంలా రహదారులు**

సదస్సుకు విచ్చేసే అతిథులు, విదేశీయులు, అధికారులు ప్రయాణించే మార్గాలను ఆధునీకీకరించారు. అవసరమైన ప్రాంతాలలో రహదారులను నిర్మించారు. మరికొన్ని చోట్ల అవసరమైన మరమ్మతులు పూర్తి చేశారు. ప్రస్తుతం బీచ్‌రోడ్డులోని సిరిపురం నుంచి సాగర్‌నగర్‌కు వరకు ఉన్న రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయి. ఫుట్‌పాత్‌లకు, డివైడర్లకు రంగులు వేశారు.

**గ్రీన్ ఆర్మీతో రక్షణ** ..బీచ్ రోడ్డులో ఎంతో వ్యయ ప్రయాసలతో నాటిన మొక్కలు పశువులు పాలుకాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గ్రీన్ ఆర్మీ పేరుతో మొక్కలను సంరక్షించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ప్రత్యేక టీ షర్టులు ధరించి సిబ్బంది మొక్కల భద్రత బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొత్తమ్మీద తూర్పు తీరం వర్ణశోభితంగా రూపుదిద్దుకొని జీ–20 ప్రతినిధులకు స్వాగతం పలకడానికి సిద్ధమైంది.

## ఆకట్టుకుంటున్న వాటర్ ఫౌంటైన్



పెదగదిలి కూడలిలో విద్యుత్ కాంతుల మధ్య వాటర్ ఫౌంటైన్

ఆరిలోవ: పెదగదిలి కూడలి వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్ ఆకట్టుకుంటోంది. ఈ కూడలిలో కొన్ని దశాబ్దాలుగా పెద్ద నుయ్యి నిరుపయోగంగా మారింది. ఈ బావి చుట్టూ ఇటీవల జీవీఎంసీ అధికారులు కమలం ఆకారంలో నిర్మాణం చేపట్టారు. అనంతరం వాటర్ ఫౌంటైన్‌గా మార్చారు. రంగు రంగుల విద్యుత్ కాంతుల మధ్య నీరు పైకి చిమ్ముతూ రాత్రి వేళ ఈ ఫౌంటైన్ కనువిందు చేస్తోంది. స్థానికులతో పాటు అటుగా వెళ్లే ప్రయాణికులు ఇక్కడ కొంతసేపు ఆగి ఫొటోలు తీసుకుంటున్నారు. దీంతో ఈ కూడలి సాయంత్రం సందడిగా మారింది.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- 16వ వార్డులో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీ ఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి ఆమె ఇసుకతోట గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన పథకాల వివరాలను తెలియజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఆర్థిక అభ్యున్నతికే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, పల్లా శ్రీనివాస్, మీసాల ప్రవీణ్, చింత వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు జగదీశ్వరి, ముత్యాల సింహాద్రి పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ అధికారికి సత్కారం



ఎన్‌ఎస్‌ఎస్ అధికారిని సత్కరిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పోలా ఉమా మహేశ్వరరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సోమవారం సత్కరించారు. ఒడిశాలో ఇటీవల జరిగిన జాతీయ సమైక్య శిబిరంలో పాల్గొని కళాశాలకు కీర్తిని తీసుకువచ్చిన సందర్భంగా ఆయనను అభినందించారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనపై గాజువాక క్రైం పోలీసులు, బాధితుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివేకానంద వీధిలో మొదటి అంతస్తులో నివసిస్తున్న పిళ్లా రమణ, చినతల్లి దంపతులు శుక్రవారం నేపాల్ పర్యటనకు వెళ్లారు. శనివారం వారి ఇంటికి ఓ బంధువు రాగా ఇంటి మెయిన్‌గేట్ తాళంతో పాటు బెడ్ రూమ్ లాక్ విరిగిపోవడం, బీరువాలో లాకర్ తెరిచి ఉండడం కనిపించింది. దీంతో గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఆదివారం ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. బీరువాలో డబ్బు, బంగారం దాచుకునే లాకర్ మాత్రమే తెరిచి ఉందని, ఇంటి యజమాని వస్తే గానీ, ఏమేం వస్తువులు అపహరించారో తెలియదని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

# కమనీయం .. కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారికరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కూరగాయల ధరలు తగ్గుముఖం

- గత వారంతో పోల్చితే కాస్త ఉపశమనం
- రైతుబజార్లలో అందుబాటులో సరకులు



రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఏయూ క్యాంపస్: కూరగాయల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. రెండు వారాలుగా ధరలు పెరుగుతుండగా.. ఈ వారం ఆ ధరలు కాస్త తగ్గాయి. రెండు వారాల క్రితం కూరగాయలు ధరలు కిలో రూ.50కి అటు ఇటుగా ఉండేవి. తాజాగా కిలోకు రూ.4 నుంచి రూ.6 వరకు తగ్గడంతో వినియోగదారులకు కాస్త ఉపశమనం లభిస్తోంది.

గత, ప్రస్తుత వారాల్లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి..

| కూరగాయలు | గత వారం ధర | ప్రస్తుత ధర |
|---|---|---|
| నల్ల వంకాయలు | 26 | 18 |
| బెండకాయలు | 50 | 40 |
| మిర్చి | 46 | 30 |
| బీర | 54 | 50 |
| బీన్స్ | 58 | 54 |
| క్యాప్సికం | 48 | 40 |
| కాకర | 46 | 40 |
| బరబాటి | 38 | 32 |
| దోసకాయ | 40 | 38 |
| ములంకాడలు | 68 | 42 |

**వేసవిలో కాస్త అధికం**

సాధారణంగా వేసవి కాలంలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. నీటి వసతులు పరిమితంగా ఉండడంతో పంటలు ఆశించిన స్థాయిలో రావు. దీంతో నాణ్యమైన కూరగాయలు లభించడం కష్టమవడంతో పాటు ధరలో కూడా పెరుగుదల కనిపిస్తుంది. మార్చినెల ప్రారంభం నుంచి కూరగాయల ధరలు పెరుగుతూ వస్తున్నాయి.

**మేలు చేసిన వర్షాలు** : ప్రస్తుతం కూరగాయల ధరలు కాస్త తగ్గాయి. ఇటీవల కురిసిన వర్షాలు సైతం కూరగాయల రైతులకు మేలు చేశాయి. తగినంత నీటి వసతి లభించడంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే కూరగాయల ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. గ్రీన్‌పీస్, దేవుడు చిక్కుడు, అల్లం ధరలు కాస్త పెరగ్గా.. ఉల్లి, టమాటా, బంగాళా దుంపల ధరలు స్వల్పంగా తగ్గాయి. క్యాబేజీ ధర కిలో రూ 10గా స్థిరంగా ఉంది. నిమ్మకాయలు మార్చి నెల ఆరంభం నుంచి కిలోకి రూ.15 వరకు పెరిగి ప్రస్తుతం రూ.110కి చేరింది.

## విద్యా సమాచారమ్

# డిగ్రీలతో పాటు నైపుణ్యాలూ అవసరం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అత్యంత పోటీ ప్రపంచం యువతకు ఆహ్వానం పలుకుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి తరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. వ్యాపారాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. సాంకేతికత మార్పులు యువతకు సవాళ్లు విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే దిశగా కృషి జరగాలని ఆచార్యులకు సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ ఇంటిలిజెన్స్ రంగాలు భవిష్యత్ సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఈసీఈ విద్యార్థులు అడుగు పెట్టాలన్నారు. ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జీవీపీ కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అన్ని రంగాలలో ఏయూ అద్భుతమైన ప్రగతిని చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, డాక్టర అరుణ, డాక్టర్ పి.వి.శ్రీదేవి, ఆచార్య కె.రమాసుధ, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

# ఘనంగా పోలమాంబ పందిరి రాట



సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ ఆలయంలో రాట వేస్తున్న అక్కరమాని



శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో రాట వేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి పంచరాత్రి జాతర మహోత్సవాలు ఈ నెల 31న ప్రారంభంకానున్నాయి. వచ్చేనెల 4న అమ్మవారి ప్రధాన పండగ జరగనుంది. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారి ఆలయ ఆవరణలో రాటోత్సవం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని ఆలయ నిర్వాహకులు, స్థానిక మహిళలతో కలసి ఉత్సవం రాట వేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ స్వాతి, ఆలయం ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు పాల్గొన్నారు.

**శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో..**

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరలో భాగంగా సోమవారం పందిరిరాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, గేదెల లావణ్య, ఎస్.నూకత్నం, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, ఈవో సురేష్‌బాబా పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయంలో భాగంగా పుట్ట బంగారం తీసుకువచ్చే కార్యక్రమం(దేవర పండగ) సోమవారం నిర్వహించారు. వచ్చేనెల 3న తొలేళ్ల పండగ, 4న అనుపు మహోత్సవం నిర్వహించనున్నారు.

# ఉచితంగా కుట్టు మెషిన్ల పంపిణీ



కుట్టు మెషిన్లు అందుకున్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఉపాధి కల్పన ధ్యేయంగా యూత్ ఫర్ సేవ సంస్థ పని చేస్తుందని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టు సమన్వయకర్త ఎం.సాయికుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సర్వీస్ నౌ సంస్థ సహకారంతో పెదజాలరిపేటలోని ఐదుగురు మహిళలకు సోమవారం కుట్టు మెషిన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదజాలరిపేటలో తమ సంస్థ ఆరు నెలలుగా కుట్టు శిక్షణ ఇచ్చిందన్నారు. ఇంటి వద్దనే ఉంటూ పని చేసుకుని ఆర్థికంగా నిలుదొక్కుకునేలా కుట్టుమెషిన్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ నౌ సంస్థ ప్రతినిధులు ఈశ్వర్, సాయిప్రశాంత్, యూత్ ఫర్ సేవ ప్రతినిధులు సునీల్, రాము, వైష్ణవి, పుండరీకాక్ష, తదితరులు పాల్గొన్నారు.

## ఎంవీపీ స్కూల్‌లో ఫీజుల పెంపుపై ఆందోళన

ఎంవీపీ కాలనీ: అళ్వార్‌దాస్ గ్రూప్స్‌లోని ఎంవీపీ పబ్లిక్ స్కూల్‌లో ఫీజుల పెంపుపై విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇష్టానుసారం ఫీజులు పెంచడమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ ఫీజు రూ.20 వేలు, యాన్యువల్ ఫీజు రూ.5 వేలు, నెలవారీ ఫీజు రూ.2150గా పేర్కొన్నారన్నారు. ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా ఫీజులు కట్టాలని పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి విద్యార్థిపై రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వెల్లడించిన మాదిరిగా ఫీజులు కట్టించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# బీజేపీ పాలనలో రాష్ట్రానికి అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార: పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లను కాదని.. నేడు దాన్ని తగ్గించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# 774వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ కార్మికుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిరసనలు చేపట్టి సోమవారానికి 774వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్‌లైతే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని, లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు